## 464 దేవుని పనియు, మనుష్యుని పనియు

రా –గౌళిపంతు (చాయ :స్తోత్రము సేయరే సోదరులారా) తా–ఆది

యెహోవయే నా – మహాదేవుఁడని – బహుగ నెఱిఁగి మన నావంతు = సహదాసులతో – మహి నొకఁడనని – సహాయ మిడుటే నీవంతు ॥యెహోవ॥

1. మితిమీఱిన దు – రిత సమూహముల – [1]క్షత మొనర్ప మన నావంతు = పతితపావనుని – [2]క్షతజనములో నను – నుతికి కడుగుటె నీవంతు ॥యెహోవ॥

2. ప్రతిదిన బ్రతుకును – మతి నుంచుచు నిను – స్తుతి యొనర్చుటే నావంతు = క్షితినేఁబడుదు – ర్వెతల నుండ శా –శ్వతముఁ బ్రోచుటె నీవంతు ॥యెహోవ॥

3. చంచల మతిఁదొల – గించుమంచుఁ బ్రా – ర్థించుచుండుటే నావంతు = అంచి తాత్మనిఁకఁ – బంచి స్థిరతను – బెంచుచుండుటే నీవంతు ॥యెహోవ॥

4. యేసు సిలువలో – నే సంధించి – గాసి సహించుట నావంతు = భాసురమోక్ష ని – వాసమునకు నను – దీసుకపోవుటే నీవంతు ॥యెహోవ॥

5. మేటి వార్త నా – బోటి జనాళికి ఁ – జాటించుటయే నావంతు = చాటిన దానిని – గాటముగ మది – నాటించుటయే నీవంతు ॥యెహోవ॥

6. అనుదిన [3]మబలుఁడ – నని మదినిం గనుఁ – గొని బ్రదుకుటయే నా వంతు = ననుఁ [4]బదాబ్జప – జ్జనుఁ జేర్చియు బల – మును గృప నిచ్చుటే నీవంతు ॥యెహోవ॥

7. ముదముతోడ నీ – తుదిరాక కొఱకు – నెదురు చూచుటే నావంతు = సదమలాత్మచే – హృదయమును సదా – పదిలపఱచునటే నీవంతు ॥యెహోవ॥

–జుటికె దావీదు

[1]నాశనము. [2]రక్తము. [3]బలహీనుడ. [4]తామరములవంటి పాద సమీపమున.



## 465 లెమ్ము తేజరిల్లుము

రా –కళ్యాణి తా–ఆది

లెమ్ము తేజరిల్లుము నీకు – వెలుగు వచ్చియున్నది = ఇమ్ముగ ప్రభుని మహిమ – ఇదిగో నుదయించె నీపై ॥లెమ్ము॥

1. జనములు నీదు వెలుగునకు – జనుదెంచెదరు గనుమ = తనర నీ యుదయ కాంతికి – తరలి రాజులు వత్తురు ॥లెమ్ము॥

2. సముద్ర వ్యాపారంబు – సరిత్రిప్పబడు వీవైపు = అమరుగ జనుల యైశ్వ – ర్యము వచ్చు నీ యొద్దకు ॥లెమ్ము॥

3. గొంజి దేవదారు సరళ – వృక్షాలు నాలయమునకు = ఎంచి తేబడు నాపాద – క్షేత్రము గొప్పగజేతు ॥లెమ్ము॥

4. నిత్యమౌ కాంతితోడ – నిన్ను వెలుంగజేతు = నిత్య సంతోషమునకు – నిన్ను కారణముగ జేతు ॥లెమ్ము॥

5. ఎంచంగ నొంటరిగాడె – ఎసగు వేయిమందియై = ఎంచంగ దగని నాడె – ఎంతో బలమగు జనమగును ॥లెమ్ము॥

– తూలూరి ప్రకాశము

## 466 కఱుణాయుత కార్యములు

రా –మోహన తా–ఆది

కఱుణాయుతం బౌకార్యములు – కనబడవలెగాదా మనలో – అనవరతము మన బ్రతుకు ప్రభునికై = అంకితమగునటు – నలవరచుకొనగ ॥కఱుణా॥

1. పొరుగవాని ప్రేమింతము మనము – కొరతలన్ని యిక దీరును మనకు – తరుగుపడ్డదా గుణమది మనలో = త్వరితగతిని సవరించుకొందమిక ॥కఱుణా॥